## క్లుప్తంగా

### విద్యార్థులకు జీఎం అభినందనలు



విద్యార్థినిని అభినందిస్తున్న ఏరియా జీఎం రాంచందర్

మణుగూరురూరల్: పది ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు గురువారం సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా జీఎం దుర్గం రాంచందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీఎం రామచందర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్వోటు జీఎం డి.లలిత్‌కుమార్, సింగరేణి పాఠశాల కరస్పాండెంట్, డీజీఎం(పర్సనల్) రమేష్, హెచ్ఎం.స్వరూపారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆలయ అర్చకుడు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లోని శ్రీ సాయిబాబా వారి మందిరంలో గురువారం భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. బాబావారి మందిరంలో ప్రతి గురువారం నిర్వహించే ప్రత్యేక పూజలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు. ఈ క్రమంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఆలయ మాజీ అధ్యక్షుడు లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల మాజీ చైర్మన్ దివంగత మాగంటి సూర్యం జ్ఞాపకార్థం వారి కుమారులు భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### గుర్తింపులేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కరకగూడెం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కనీస గుర్తింపు లేకుండ పుట్టగొడుగుల్ల పుట్టుకొచ్చిన ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎన్ఎఫ్ఎస్(నేతకాని విద్యార్థి సంఘం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రేమ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఈ మేరకు ఆయన గురువారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడుతూ.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల్లో విద్యార్థినీ విద్యార్థుల కోసం కనీస సౌకర్యాలైన క్రీడాప్రాంగణం, క్రీడా సామగ్రి, మూత్రశాలలు, అత్యవసర సేవలైన ఫైర్ సేఫ్టీ వంటివి పాటించకుండా అధిక ఫీజులు వసూళ్ల చేస్తూ విద్యార్థుల తల్లితండ్రుల రక్తాన్ని జలగల్లా పీల్చుతున్నారని అన్నారు. ప్రభుత్వం వారిపై చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న తీరు సరైనది కాదని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉదాసీన వైఖరి మార్చుకుని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేదంటే నేతకాని విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో నేతకాని విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు జిమ్మిడి ప్రకాష్, సభ్యులు గోగు సాయి, రాజేష్, జాడి సిద్దార్థ, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

### ఆలయ ప్రతిష్ఠాపన



త్రికూట ఆలయంలో శిఖరాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

చర్ల: మండల కేంద్రమైన చర్లలో నూతనంగా నిర్మించిన త్రికూట ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవం గురువారం అర్చకుడు మాగి విశ్వనాథ శర్మ నేతృత్వంలో వైభవంగా సాగింది. త్రికూట ఆలయంలో లక్ష్మీగణపతి, వాసవీ కన్యకా పరమేశ్వరి, వెంకటేశ్వరస్వామి వార్ల విగ్రహాలను వేదపండితుల మంత్రోచ్చరణలు, భారీగా తరలివచ్చిన భక్తజనుల నీరాజనాల నడుమ ప్రతిష్ఠించారు. అనంతరం వెంకటేశ్వరస్వామి దివ్య శాంతి కల్యాణం నిర్వహించారు. భారీ అన్నదానం చేపట్టారు.

### నేడు సుదర్శన హోమం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీబాలాజీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో నేడు (శుక్రవారం) సుదర్శన హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజర్ పీవీ రమణ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శ్రావణ నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలో ఉదయం 7.30 గంటల నుంచి సుదర్శన హోమం ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు.

# వేగంలో నత్తతో పోటీ!

- ముందుకు కదలని మన ఊరు-మన బడి పనులు
- బిల్లుల చెల్లింపులో జాప్యం
- పనులకు విముఖత చూపుతున్న కాంట్రాక్టర్లు



మన ఊరు-మన బడి నిర్మాణ పనులు పూర్తికాని తుమ్మలచెరువు ప్రాథమిక పాఠశాల

అశ్వాపురం: తెలంగాణ ప్రభుత్వం మన ఊరు-మన బడి పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. అయితే మండలంలో ఎంపికైన పాఠశాలల్లో మన ఊరు-మన బడి పథకం నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. బిల్లుల చెల్లింపులో ప్రభుత్వం జాప్యం చేస్తుండటంతో పాఠశాలల్లో నిర్మాణ పనులు నెలల తరబడి ముందుకు సాగడం లేదు.

**15 పాఠశాలల్లో పనులు..**

మండలంలో సుమారు 2.30 కోట్లతో 15 పాఠశాలల్లో మన ఊరు-మన బడి పనులు చేపట్టారు. అశ్వాపురం జెడ్పీ, ప్రాథమిక, సీతారాంపురం జెడ్పీ, ప్రాథమిక, మల్లెలమడుగు జెడ్పీ, ప్రాథమిక, కల్యాణపురం, పాయం మంగయ్యగుంపు, జగ్గారం, ఆనందాపురం, మొండికుంట, కుర్వాపల్లికొత్తూరు, తుమ్మలచెరువు, వెంకటాపురం, గొందిగూడెం కొత్తూరు ప్రాథమిక పాఠశాలల్లో మన ఊరు-మన బడి పనులు చేపట్టారు. ఈ పాఠశాలల్లో మరుగు దొడ్లు, మూత్రశాలలు, ప్రహరీ, భవనాల మరమ్మతులు, విద్యుత్, తాగునీరు, వంట షెడ్లు, పెయింటింగ్ తదితర పనులు చేపడుతున్నారు. మూడు జిల్లా పరిషత్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా డైనింగ్ హాల్ నిర్మిస్తున్నారు.

**రెండు పాఠశాలలే పూర్తి..**

అయితే, ఇప్పటి వరకు కల్యాణపురం, పాయంమంగయ్య గుంపు రెండు ప్రాథమిక పాఠశాలల్లో మాత్రమే పనులు వంద శాతం పూర్తి అయ్యాయి. అశ్వాపురం జెడ్పీ, సీతారాంపురం, వెంకటాపురం, గొందిగూడెం కొత్తూరు ప్రాథమిక పాఠశాలల్లో పెయింటింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. మిగతా తొమ్మిది పాఠశాలల్లో నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులకు సంబంధించి బిల్లులు ప్రభుత్వం చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు ఆర్థిక ఇబ్బందులతో పనులు చేపట్టడం లేదు. ఒక్కో కాంట్రాక్టర్లు రూ.5 లక్షలు నుంచి 10 లక్షలు అప్పులు తెచ్చి పెట్టడంతో బిల్లులు కాక పనులు చేయలేకపోతున్నారు. ప్రభుత్వ బిల్లులు మంజూరు చేస్తే పనులు వేగవంతమై త్వరితగతిన పూర్తి అయ్యే అవకాశం ఉంది.

**ప్రతిపాదనలు పంపాం**

మండలంలో 15 పాఠశాలలకు రెండు పాఠశాలలు పూర్తి అయ్యాయి. మరో నాలుగు పెయింటింగ్ దశలో ఉన్నాయి. మిగిలిన పాఠశాలల్లో పనులు జరుగుతున్నాయి. బిల్లులు ఆలస్యం అవుతుండటంతో కాంట్రాక్టర్లు పనులు వేగంగా చేయలేకపోతున్నారు. పనులకు సంబంధించి బిల్లులు ప్రతిపాదనలు పంపాం. వాటిని ఆమోదించాల్సి ఉంది.

– గణేష్, పథకం పర్యవేక్షకుడు

## రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రత్నకల్యాణి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం రెవెన్యూ డివిజనల్ అండ్ ఎలక్టోరల్ రిజిస్ట్రేస్ అధికారి రత్నకల్యాణి ఆధ్వర్యంలో భద్రాచల నియోజకవర్గ స్థాయి రాజకీయ పార్టీల నాయకులతో గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమీక్షించారు. ఒకే కుటుంబంలో ఆరు ఓట్ల కన్నా ఎక్కువ ఉంటే 8ఏ ఫారం ద్వారా మార్చడం, పాత పోలింగ్ బూత్‌ల స్థానంలో కొత్తవి ఏర్పాటు గురించి సమావేశంలో చర్చించారు. అలాగే నియోజకవర్గ స్థాయిలో బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకం చేసి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని అన్ని రాజకీయ పార్టీల నాయకులను అధికారి కోరారు.

## రుణాల రికవరీపై దృష్టి పెట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంరెడ్డి

అశ్వారావుపేటరూరల్: బ్యాంకర్లు రుణాల రికవరీపై దృష్టి పెట్టాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ వి.రాంరెడ్డి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఎస్‌బీఐ ఆధ్వర్యంలో బ్యాంకర్లు, ఐకేపీ సిబ్బందితో జేఎంఎల్‌బీసీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ.. డ్వాక్రా, స్త్రీ నిధి ద్వారా మహిళలకు ఇచ్చిన రుణాలను తిరిగి రికవరీలు చేయాలని, అదే విధంగా రుణాలను సక్రమంగా చెల్లించే గ్రూపులకు కొత్త రుణాలను సకాలంలో మంజూరు చేయలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న రుణాలను వసూలు చేయాలని అన్నారు. సమావేశంలో ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వర రెడ్డి, ఎస్‌బీఐ మేనేజర్ కృష్ణ, యూనియన్, గ్రామీణ వికాస్ బ్యాంక్, డీసీసీబీ బ్యాంక్ మేనేజర్లు, ఐకేపీ సీసీలు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రేగా వ్యాఖ్యలు సరికాదు



అశ్వారావుపేటరూరల్: మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు



అశ్వాపురం: మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు గాదె కేశవరెడ్డి

అశ్వారావుపేటరూరల్: తునికాకు చెక్కుల పంపిణీలో ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు, భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే పోడెం వీరయ్యపై చేసిన వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు అశ్వారావుపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు మొగళ్లపు చెన్నకేశవరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించకుండా, అధ్యక్ష స్థానాన్ని ఎమ్మెల్యే వీరయ్యకు ఇవ్వకుండా అవమానించినట్లు ఆరోపించారు. అధికార పార్టీలోకి అడ్డదారిలో వచ్చి, ప్రభుత్వ కార్యక్రమంలో రాజకీయలు మాట్లాడటం ఎమ్మెల్యే రేగా కాంతారావుకు తగదన్నారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ వేముల భారతి, నాయకులు దేవరాజు, బాలయ్య, రమాదేవి, విజయలక్ష్మి ఉన్నారు.

మణుగూరురూరల్: దుమ్ముగూడెంలో జరిగిన తునికాకు బోనస్ చెక్కుల పంపిణీలో పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు, డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొడెం వీరయ్యపై అమర్యాదగా ప్రవర్తించడం సరికాదని, రేగా తన తీరును మార్చుకోవాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. గురువారం జరిగిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ కాటిబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ.. దుమ్ముగూడెంలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే రేగా కాంతారావు బీఆర్ఎస్ పార్టీ గొప్పలు చెప్పుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. ప్రభుత్వ అధికారుల కార్యక్రమంలో పార్టీ గురించి, ఎన్నికల గురించి ప్రసావించకూడదన్న విషయం కూడా ఎమ్మెల్యే రేగా కాంతారావు తెలియదా అని ఎద్దేవా చేశారు. స్థాయిని మరిచి తమ నేత, ఎమ్మెల్యే వీరయ్య పట్ల అమర్యాదగా సంబోధించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే రేగా కాంతారావు తీరు మార్చుకోవాలని హితవు పలికారు. సమావేశంలో నాయకులు బీరం సుధాకర్‌రెడ్డి, పీరినాకి నవీన్, కె.సత్యనారాయణ, లతీఫ్, లాలు, చింటూ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: దుమ్ముగూడెం మండలంలో తునికాకు కూలీలకు బోనస్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పొడెం వీరయ్యపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రభుత్వ విప్ రేగా కాంతారావు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మండలంలోని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటైన సమావేశంలో సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పొడెం వీరయ్యపై ప్రభుత్వ విప్ రేగా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ సంబంధిత కార్యక్రమంలో కలెక్టర్, ఎస్పీ ఇతర ప్రభుత్వ అధికారులు పాల్గొన్న కార్యక్రమంలో రాజకీయ ఉపన్యాసాలు ఎలా చేస్తారని, తోటి శాసన సభ్యుడు అన్న గౌరవం కూడా లేకుండా ఏకవచనంతో ఎలా సంబోధిస్తారని ప్రభుత్వ విప్ రేగాను ప్రశ్నించారు. భద్రాచలంకు ఇస్తామన్న రూ.వంద కోట్లు ఏమయ్యాయని, వరద ముంపు ప్రాంత ప్రజలకు ఇళ్లు కట్టిస్తామని చెప్పిన హామీ ఏమైందని టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సమావేశంలో పాములపల్లి సర్పంచ్ బట్ట సత్యనారాయణ, నాయకులు తూము వీరరాఘవులు, బచ్చు వెంకటరమణ, వీరయ్య, ఊకే లక్ష్మీనారాయణ, పోడుతూరి రాంబాబు, ఈనెపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### సాయిబాబా ఆలయాల్లో పూజలు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వినాయకపురం, అశ్వారావుపేటలోగల సాయిబాబా, శ్రీ షిరిడి సాయిబాబా ఆలయాల్లో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు చేరుకొని బాబాను దర్శించుకుని అభిషేకాలు చేసి, హారతులు పట్టారు. అలాగే మధ్యాహ్నం సమయంలో ఆలయాల వద్ద అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

### వ్యవసాయ పరికరాలు పంపిణీ



గిరిజన రైతుకు ట్రాక్టర్ అందజేస్తున్న సంస్థ మేనేజర్ రామకృష్ణ

భద్రాచలంటౌన్: భద్రాచలం డివిజన్‌లోని గిరిజన రైతులకు కిషన్ పరివార్ ఫౌండేషన్ ఆధ్వర్యాన వ్యవసాయ గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా ప్రాజెక్ట్ జిల్లా మేనేజర్ రామకృష్ణ గురువారం వ్యవసాయ పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుమ్ముగూడెం మండలానికి చెందిన గిరిజన రైతు పాయ రాంబాబుకు రాయితీ ద్వారా ట్రాక్టర్‌ను అందజేసినట్లు తెలిపారు. భద్రాచలం నియోజకవర్గంలోని ఐదు మండలాలలో సంస్థ ఎన్నిక చేసిన ఐదు గ్రామ పంచాయితీలలోని గిరిజన రైతులకు ఉచిత సభ్యత్వం ఇవ్వడం జరుగుతుందన్నారు. సభ్యత్వం పొందిన రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలు, విత్తనాలు, ఎరువులు పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమానికి జిల్లాలోని సంస్థ నియోజకవర్గాల మేనేజర్లు, గిరిజన రైతులు పాల్గొన్నారు.

### జయప్రదం చేయండి

భద్రాచలంటౌన్: ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్రాహ్మణ సదస్సును ఈ నెల 16 ఖమ్మం పట్టణంలోని గాయత్రి భవన్‌లో నిర్వహించనున్నట్లు గాయత్రి బ్రహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రామావజ్జల రవికుమార్ శర్మ, రామాచార్యులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని బ్రహ్మణ సమాజానికి చెందిన అన్ని వర్గాల వారు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

### ఎక్స్‌గ్రేషియా అందించడంపై కృతజ్ఞతలు

మణుగూరురూరల్: కరోనాతో మరణించిన ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్ బొల్లం శ్రీకాంత్ కుటుంబానికి రూ.15లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కు అందించడం పట్ల మృతుని భార్య నాగమణి, ఇష్టూ నాయకులు సింగరేణి యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గురువారం నాగమణి విలేకరులతో మాట్లాడుతూ.. తన భర్త మరణంతో తాము అనాథలమయ్యామని, ఆనాటి నుండి తన ఇద్దరు పిల్లలను పోషించుకునేందుకు ఎంతో ఇబ్బందులు పడ్డామని తెలిపారు. సింగరేణి యాజమాన్యం అందించిన ఈ ఎక్స్‌గ్రేషియా పరిహారం తన కుటుంబ భవిష్యత్తుకు ఎంతో అండగా నిలువనుందన్నారు. అలాగే ఎక్స్‌గ్రేషియా వచ్చేంత వరకు తమ కుటుంబానికి భరోసాగా ఉన్న ఇష్టూ నాయకులకు, ఏరియా సెక్యూరిటీ అధికారులకు, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు ధన్యవాదాలు తెలిపారు. ఇష్టూ నాయకులు మంగీలాల్, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు రామ్ అవతార్, యగ్గడి ప్రభాకర్, భరత్, సుధాకర్, శ్రీకాంత్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మటంలంక వద్ద బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేస్తున్న విప్ రేగా కాంతారావు

గుండాల: రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని, దీంతో తెలంగాణ రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. గురువారం గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో పర్యటించిన ఆయన.. పలు అభివృద్ధికి పనులకు శంకు స్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం రైతు వేదికలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతాలు గతంలో ఎలాంటి అభివృద్ధికీ నోచుకోలేదని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కోట్ల నిధులు తీసుకువచ్చి రహదారులు, బ్రిడ్జీలు, సాగునీరు, తాగునీరు, విద్య, వైద్య తదితర విభాగాల్లో అభివృద్ధికి పట్టం కడుతున్నామని అన్నారు.

అనంతరం పలు గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తొలత కొమరారం నుంచి చెట్టుపల్లి వరకు రూ.6 కోట్ల 35లతో పూర్తిచేసిన బీటీ రోడ్డును ప్రారంభించారు. ఇల్లందు నుంచి వయా కొమరారం మీదుగా ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. మటంలంక వద్ద రూ.2కోట్ల 40 లక్షలతో తొట్టివాగుపై హైలెవల్ వంతెన పనులకు శంకుస్థాపన చేశారు. లింగగూడెం వద్ద రూ.30లక్షలతో లోలెవల్ వంతెన నిర్మానికి శంకుస్థాపన చేశారు. కొడవటంచ నుంచి నడిమిగూడెం వరకు పూర్తిచేసిన బీటీ రోడ్డును ప్రారంభించారు. గుండాల-రంగాపురం మద్య దామర్ల వాగుపై బ్రిడ్జీని ప్రారంభించారు. మల్లెల గుంపు వద్ద రూ.3కోట్ల 80 లక్షలతో బ్రిడ్జీ పనులకు, ఆళ్లపల్లి మండలం చంద్రాపురం వద్ద జల్లేరుపై బ్రిడ్జీ పనులకు, భట్టుపల్లి నుంచి రేగల్ల వరకు 3 కల్వర్టులకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ముక్తి సత్యం, సర్పంచ్‌లు కోరం సీతారాములు, ఆర్ అండ్‌బీ, డీఈ వెంకటేశ్వర్లు, పీఆర్ డీఈ సైదుల్‌రెడ్డి, ఐటీడీఏ ఏఈలు మోతీలాల్, అఖిల్, తహసీల్దార్ నాగదివ్య, ఎంపీడీవో సత్యనారాయణ, గుండాల సీఐ, ఎస్సై రాజశేఖర్, బీఆర్ఎస్ భవానీ శంకర్, తెల్లం భాస్కర్, వీరస్వామి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటోడ్రైవర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రాఘవేంద్రరావు

మణుగూరురూరల్: ఆటోడ్రైవర్లు ప్రయాణికుల పట్ల సత్ప్రవర్తనతో మెలగాలని మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు సూచించారు. గురువారం స్థానిక వేణురెస్టారెంట్ హాల్‌లో డీఎస్పీ రాఘవేంద్రరావు ఆటో డ్రైవర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలని, సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. ప్రయాణికుల పట్ల అమర్యాదగా ప్రవర్తించినా.. ఇబ్బందులకు గురి చేసినా శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ప్రతీ ఆటో డ్రైవర్ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో మణుగూరు సీఐ ముత్యం రమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్సెస్సీ ఫలితాల్లో 'అరుణోదయ' సత్తా



విద్యార్థినిని అభినందిస్తున్న అరుణోదయ కరస్పాండెంట్ అరవింద్‌కుమార్



ప్రతిభ చాటిన ఎక్సలెంట్ విద్యార్థులు

మణుగూరురూరల్: పదో తరగతి ఫలితాల్లో అరుణోదయ విద్యాలయం విద్యార్థులు సత్తా చాటారు. ఎస్.సాయి సంజన 10 జీపీఏతో పాటు ఏంజిల్ పిలోసుజిత్ 9.8, పి.కావ్య చౌదరి 9.7, ఎస్.కే.షఫీపాషా 9.5, ఆర్.సాయిరాం 9.5, సీహెచ్.రోహిత్ శ్రీనివాస్ 9.3, ఆర త్రిశాంత్ 9.3, కె.హాసిని 9.2 జీపీఏ సాధించగా విద్యార్థులను కరస్పాండెంట్ మాదాసు అరవింద్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

**'ఎక్సలెంట్' విజయకేతనం**

మణుగూరు ఎక్సలెంట్ విద్యాసంస్థల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఏ.గీతామాధురి, జి.తానీశ్వర్ 10 జీపీఏ సాధించారని విద్యాసంస్థల చైర్మన్ ఎండి.యూసఫ్ షరీఫ్ తెలిపారు. అలాగే, జాస్మిత, ఇర్ఫాన్, చరణ్, నిఖిత్, అయోనా 9.8, మరో తొమ్మిది మంది విద్యార్థులు 9.7, పది మంది 9.5, 11మంది 9.3సాధించగా, 26మంది 9జీపీఏకు పైగా సాధించారని పేర్కొన్నారు. విద్యార్థులను చైర్మన్‌తో పాటు కరస్పాండెంట్ ఎం.డీ.ఖాదర్, డైరెక్టర్లు యాకూబ్ షరీఫ్, ఖాన్, నరేందర్, సురేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

## లయన్స్‌క్లబ్ ఆర్థిక సాయం



బాధితులను ఆర్థిక సాయం అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో రాజుపేట కాలనీలో నివాసముంటున్న పాపారావు-రమాదేవిల నివాసంలో ఇటీవల గ్యాస్‌లీక్ అయ్యి ప్రమాదం సంభవించగా.. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స తీసుకుంటున్నారు. కాగా నిరుపేదలైన పాపారావు దంపతులు లయన్స్ క్లబ్ సాయం కోరగా.. లయన్స్ క్లబ్, రెడ్ క్రాస్ సభ్యులు స్పందించి గురువారం రూ.46 వేల ఆర్థిక సాయం ఆస్పత్రిలో అందించారు. లయన్స్ సీనియర్ సభ్యులు యేగి సూర్యనారాయణ, శివశంకర్ నాయుడు, జి.శంకర్‌రావు, గోళ్ల భూపతిరావు, ఎమ్.పూర్ణచందర్ రావు, పి.దేశప్ప, బి.వెంకట రెడ్డి, బి.రంగారెడ్డి, బి.శ్రీనివాస రెడ్డి, సిద్ధారెడ్డి, బి.కృష్ణయ్య, ఎస్‌బీసీ సత్యనారాయణ, సీహెచ్ రామలింగేశ్వర రావు, జక్కం ప్రసాద్, డి.జానకిరామ్, ఏ.నరసింహ చారీ, కె.వెంకట్ రెడ్డి, పి.వాసు, ఎస్.శ్రీనివాస్, డాక్టర్ చావా లక్ష్మీనారాయణ, వై.వెంకటేష్, గోపినాథ్ రెడ్డి, బి.రామకృష్ణ తదితరులు వారి వంతు ఆర్థిక సాయం అందించారు.

## మందకొడిగా ధాన్యం కొనుగోళ్లు



కొనుగోలు కేంద్రంలోనే ఆరబోసిన ధాన్యం

బూర్గంపాడు: యాసంగి ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. రైతులు రోజుల తరబడి కల్లాల్లోనే పడిగాపులు గాస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మకాల కోసం నిరీక్షిస్తున్నారు. అకాల వర్షాలు ఓ పక్క.. కొనుగోళ్లలో మందగమనం మరోపక్క. ఈ పరిస్థితితో రైతుల కంటి మీద కునుకు లేకుండా పోయింది. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చి ఇరవైరోజులవుతున్నా కొనుగోళ్లలో మాత్రం తీవ్ర జాప్యం చోటుచేసుకుంటుంది. అకాలవర్షాలు, గాలిదుమ్ములతో రైతులు ధాన్యాన్ని కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. మిల్లుల వద్ద రోజుల తరబడి ధాన్యం దిగుమతులు కావటం లేదు. తేమ, తాలు సాకుతో మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారు.ధాన్యం దిగుమతికి మిల్లులకు వెళ్లిన లారీలు తిరిగి బయటకు వచ్చేందుకు నాలుగైదు రోజుల సమయం పడుతోంది. మిల్లుల కేటాయింపు, గన్నీబ్యాగుల కొరత, సరుకు రవాణాకు లారీల ఇబ్బందులు ఈసారి యాసంగి ధాన్యం అమ్మకాలకు ప్రతిబంధకంగా మారుతుంది. తేమశాతం, తాలు పేరుతో మిల్లర్లు ధాన్యం కాంటాలో కోత విధిస్తున్నారు. ఒక్కో కొనుగోలు కేంద్రం నుంచి రోజుకు కనీసం రెండు లారీల ధాన్యం పంపే పరిస్థితులు కూడా లేవు. ఇప్పటికే మిల్లర్లు మా టార్గెట్లు పూర్తయ్యాయి మాకు సరుకు పంపవద్దని కొనుగోలు కేంద్రాల నిర్వహకులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.